తెనాలి

• తెనాలి • పొన్నూరు

వ్యాధులపై అవగాహన అవసరం

చేబ్రోలు, న్యూస్‌టుడే: పశువులు, జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గుంటూరు జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. చేబ్రోలు పశువైద్యశాలలో సోమవారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పశువుల నుంచి సంక్రమించే బ్రూసెల్లాసిస్, లెప్టోస్పైరాసిస్, ఖనకాల వల్ల వచ్చే రేబిస్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యాధికారి సాంబశివరావు, తెదేపా నాయకులు మైలా రామరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వే గందరగోళం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఎన్నికల కమిషన్ తీసుకువచ్చిన సర్ సమగ్ర సర్వే గందరగోళంగా ఉందని సీఐటీయూ నాయకులు కె.బాబూప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని హమాలీలకు సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్యుమరేషన్ ఫారాలు రెండింటిలో ఒకదానిని ఓటర్ల వద్ద భద్రంగా ఉంచుకోవాలన్నారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)

అత్యధికం: 4,000
అత్యల్పం: 2,500
సగటు: 3,400

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ రామలింగేశ్వరపేట మెయిన్‌రోడ్డులో పైపు పగిలి తాగు నీరు వృథా అవుతుంది. పైపు కాలువ పక్కనే ఉన్నందున నీరు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉంది. **- రమేష్‌కుమార్, రామలింగేశ్వరపేట**

✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం.

? తెనాలి కొత్తపేట కాళ్లేశ్వరం రోడ్డులో ప్రధాన మురుగు కాలువలు పూడికలతో నిండిపోయాయి. కల్వర్టుల వద్ద అడ్డంకులతో మురుగు పారుదల లేకపోవడంతో పరిసరాల్లోని వీధుల్లోనూ సమస్య కొనసాగుతుంది. **- నీరజ, కొత్తపేట**

✔ పూడికలు తొలగింప చేసి, మురుగు పారుదలకు ఆటంకం లేకుండా చేస్తాం. **- పై ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు సమాధానాలు ఇచ్చారు. - న్యూస్‌టుడే, తెనాలిటౌన్**

స్పందించారు.. చెత్త తరలించారు

స్పందన: తెనాలి పట్టణ గంగానమ్మపేట జొన్నలగడ్డ వారి వీధిలో చాలా రోజులుగా వ్యర్థాల గుట్టలు పడి ఉన్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయాన్ని తెలియజేస్తూ ఈ నెల 6వ తేదీన 'అసలే ఇరుకు.. అందులో వ్యర్థాలు' శీర్షికతో ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్ ద్వారా తరలించారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

డబ్బులున్నా.. 'లాటరీ' రాలేదు

న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

తెనాలి బీటీ రోడ్డు నిర్మాణంలో కొనసాగుతున్న జాప్యం

రాళ్లు పైకి తేలి అధ్వానంగా జిల్లా ఆసుపత్రి రోడ్డు

గుంతలు పడిన బీటీ రోడ్లతో తెనాలి వాసులు అవస్థలు పడుతున్నారు. రోడ్ల అభివృద్ధికి సరిపడా నిధులున్నా పనులు మాత్రం పట్టాలెక్కడం లేదు. దీంతో అధ్వానంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించడంతో జనం తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. తెనాలి వాసులకు ఎంతగానో ఉపయోగపడే ఈ రోడ్లను పూర్తి చేయాలంటే చెన్నై లాటరీ తగలాల్సి ఉంది. రోడ్డు నిర్మాణానికి చెన్నై లాటరీకి సంబంధం ఏమిటంటే..

పట్టణంలోని తెనాలి జిల్లా ఆసుపత్రి, కేఎస్‌ఎం ఉన్నత పాఠశాల పక్క రోడ్డు అధ్వానంగా మారిందని, గుంతల దారిపై రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నామని అప్పటి వైకాపా కౌన్సిలర్లు పలుమార్లు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లకు రూ.1.30 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచి గుత్తేదార్లను ఎంపిక చేశారు. ఇదంతా పూర్తయ్యేసరికి యుద్ధం మొదలైంది. దాని ప్రభావం బీటీ రోడ్లపై పడింది. యుద్ధం కారణంగా తారు కొరత ఏర్పడింది. ఈక్రమంలోనే దాని డిమాండ్, ధర పెరిగింది. అప్పటి నుంచి చెన్నైలో దిగుమతి అయిన తారును లాటరీ విధానంలో పంపిణీ చేస్తున్నారు. లాటరీ తగిలిన గుత్తేదారుకు తారును పంపిణీ చేయడం పరిపాటి అయింది. తెనాలి గుత్తేదారుకు సరఫరా చేసే సంస్థకు ఇంకా ఆ అదృష్టం వరించలేదు. దీంతో గుత్తేదారు ఇంకా ఆ టెండర్ పనులు మొదలుపెట్టలేదు. టెండర్ పిలిచిన నాటి పరిస్థితి ఇలా ఉంటే పిలవాల్సిన సుమారు రూ.2 కోట్ల విలువైన రోడ్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆ లాటరీ ఎప్పుడు తగులుతుందో బీటీ రోడ్ల పనులు ఇంకెప్పుడు మొదలు పెడతారో అర్థం కావడం లేదు. దీనిపై మున్సిపల్ ఇంజినీరు శ్రీకాంత్‌ను సంప్రదించగా టెండర్ దక్కించుకున్న గుత్తేదారు బీటీ రోడ్డు వేయాల్సిందేనని, తారు సరఫరా, ధర పెరుగుదల వంటి వాటితో సంబంధం లేదన్నారు. త్వరలో బీటీ రోడ్ల పనులు చేపట్టనున్నట్లు గుత్తేదారు చెప్పినట్లు పేర్కొన్నారు.

అలరించిన నాటికలు

కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు ధారిబుల్ ట్రస్ట్ సంయుక్తంగా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండో రోజు సోమవారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి తృతీయ ఆహ్వాన నాటికల పోటీలలో ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. బి.వి.కె.క్రియేషన్ కాకినాడ వారి కన్నీటికి విలువ ఎంత?, గౌరీ నటరాజ డ్రామెటిక్ ఆసోసియేషన్ పెందుర్తి వారి నీళ్లు - నీళ్లు, మల్లీశ్వరి ఆర్ట్స్ హైదరాబాద్ వారి నువ్వో సగం, నేనో సగం నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతరావు, సినీమాటల రచయిత బుర్రా సాయిమాధవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు పెరిగిపోయాయని, ప్రతి ఒక్కరూ వాటి తీరుపై అవగాహన పెంచుకోవాలని, మరింత మందికి తెలియచేయాలని సీడీపీవో విజయగౌరి తెలిపారు. తెనాలి మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఆమె పొదుపు సంఘాల మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీలు చెప్పవద్దని, ఇంటి దగ్గరే పని వేలాది రూపాయల వేతనాలు అంటే నమ్మవద్దని, పోలీస్ దుస్తుల్లో ఉన్నవారు వీడియో కాల్ చేసి మీపై కేసు ఉందని చెబితే భయపడవద్దని, మనకు పరిచయం లేని నంబరు నుంచి వీడియో కాల్ వస్తే లిఫ్ట్ చేయవద్దని, ఏ విషయంపై అయినా అనుమానం వస్తే ఆలోచించి, తెలిసిన వారిని అడిగి తెలుసుకోవడం ద్వారా నష్టాలను నివారించుకోవచ్చునని వివరించారు. మాతృత్వ సంరక్షణపై కూడా ఆమె మాట్లాడారు. ఏపీఎం జయశ్రీ, వైద్యాధికారి డాక్టర్ హనీష్, మీనా, మల్లిక, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీడీపీవో విజయగౌరి

కొత్త పింఛను మంజూరు చేయాలి

కమిషనర్‌కు సమస్య తెలియజేస్తున్న అర్జీదారు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛను రూ.4 వేలను రూ.6 వేలకు పెంపుదల చేయాలని, కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కమిషనర్ జె.రామఅప్పలనాయుడుని పలువురు అర్జీదారులు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించాలని స్వర్ణ వార్డు సచివాలయాల ఉద్యోగులకు సూచించినట్లు ఆయన తెలిపారు.

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు, పరిష్కారాల వేదిక కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 18 అర్జీలు వచ్చాయి. ఆక్రమణలు, భూ సంబంధ అంశాలు, అనుమతి లేని నిర్మాణాలు, సౌర విద్యుత్తు విధానంలో ఎదురవుతున్న సమస్యలు, వ్యక్తిగత అంశాలపై అర్జీలతో వచ్చిన వారితో ఆర్డీవో కె.శ్రీరమణి మాట్లాడారు. కొన్ని వైద్యశాలలు, సినిమా థియేటర్లు, దుకాణాల వారు డిజిటల్ చెల్లింపులను నిరాకరిస్తున్నారని, అన్ని చోట్ల వినియోగంలో ఉండేలా చూడాలని పలువురు పట్టణ వాసులు వినతిపత్రం అందించారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 11 అర్జీలు అందుకున్నారు.

షాదీఖానా పనులు ప్రారంభిస్తాం

పొన్నూరు: పొన్నూరులో సగంలో నిలిచిపోయిన షాదీఖానా నిర్మాణ పనులకు కూటమి ప్రభుత్వం రూ.2.85 కోట్ల నిధులు మంజూరు చేసిందని త్వరలోనే పనులు ప్రారంభించడానికి తగు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రజారోగ్యశాఖ సాంకేతిక పర్యవేక్షణాధికారి దాసరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని 26వ వార్డులో షాదీఖానాను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పొన్నూరు పురపాలక సంఘంలో నూతన రహదారులు, ఇతర పనులు చేయడానికి ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించిందని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిబంధనల మేరకు పనులు చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకయ్య పాల్గొన్నారు.

క్షయను నిలువరిద్దాం

కొల్లిపర, న్యూస్‌టుడే: ప్రజల బాగస్వామ్యంతోనే క్షయ వ్యాధి నివారణ సాధ్యమని డాక్టర్ పళ్లికొండ రవికుమార్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కొల్లిపర గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. వ్యాధి నిర్ధారణకు ఆధునిక సాంకేతికత నేడు అందుబాటులో ఉందన్నారు. వ్యాధికి కారణాలు తెలియచెప్పారు. 2030 నాటికి క్షయ వ్యాధిని అంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఎంపీహెచ్‌వో నాగరాజు, ప్రసాద్, వి.లక్ష్మి, డాక్టర్ ప్రదుదాస్ తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ.. శంభో శంకర

కరపత్రం ఆవిష్కరిస్తున్న లక్ష్మీ పద్మావతి, వెంకటేశ్వర్లు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఓం నమః శివాయ అనే శివ పంచాక్షరి మహా మంత్రాలు 11 కోట్ల సార్లు జపించాలని సంకల్పించినట్లు పెనుగొండ పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి పేర్కొన్నారు. తెనాలి గంగానమ్మపేటలోని సాలిగ్రామ మఠం శ్రీ విద్యాపీఠంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది మార్చి 6వ తేదీ వరకు 216 రోజులపాటు మహా మంత్రాలు జపించాలని ఆయన తెలిపారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్, గూగుల్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మహాదేవుని అనుగ్రహం కోసం ఈ జప యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రామఅరావు సతీమణి లక్ష్మీ పద్మావతి, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, కొండూరు పద్మావతి, గడ్డిపాటి శ్రీనివాసరావు, ముద్దాబత్తుని రమణయ్య, గోపి, పెనుగొండ వెంకటేశ్వరరావు, వఝ్ఝలగడ్డ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగం కావాలి

నూతన అధ్యక్షుడికి బాధ్యతలు అందజేస్తున్న జీఎంఎస్.గుప్తా

పొన్నూరు, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ నూతన పాలకవర్గ సభ్యులు సమాజ సేవలో పాలు పంచుకోవాల్సిన బాధ్యత ఉందని రోటరీ క్లబ్ చైర్మన్ కొల్లా సింగారావు పేర్కొన్నారు. సోమవారం రాత్రి పొన్నూరు మినుములు వ్యాపారుల అసోసియేషన్ కార్యాలయంలో రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కారుమూరి శ్రీనివాస్, కార్యదర్శిగా జానీబాషా బేగ్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గత అధ్యక్షుడు జీఎంఎస్.గుప్తా నూతన అధ్యక్షుడికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించి వారికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పొన్నూరు పురపాలక సంఘ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, హరిహర ప్రసాద్, రోటరీక్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలపై పడిన ఫ్లెక్సీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలో సోమవారం వీచిన ఈదురు గాలులకు బోస్‌రోడ్డులోని ఒక భవంతి పై భాగంలో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ, ఆనుసంధాన ఇనుప చువ్వలు కింది భాగంలోని విద్యుత్తు తీగలపై పడ్డాయి. దానితో కొన్ని విద్యుత్తు తీగలు దెబ్బతిన్నాయి, ఒక తీగ తెగింది. విద్యుత్తు విభాగ అధికారులు, సిబ్బంది సత్వరం స్పందించి మరమ్మతులు పూర్తి చేశారు. తరచూ ఇదే తరహా ఘటనలు చోటు చేసుకుంటున్న క్రమంలో అధికారులు ఫ్లెక్సీల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదం అంచున ప్రయాణం

పట్టణంలో దెబ్బతిన్న చప్టాలు ★ మరమ్మతులు చేయాలంటున్న స్థానికులు

న్యూస్‌టుడే, పొన్నూరు

12వ వార్డులో సైడువాల్స్ లేక ప్రమాదకరంగా వంతెన

పట్టణంలోని కీలక మార్గాల్లో రాకపోకలు నిర్వహించేందుకు కాలువలపై వంతెనలు నిర్మించారు. కాలం చెల్లడంతో కొన్ని వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ప్రమాదం పొంచి ఉన్నా గత వైకాపా పాలకులు నిధులు మంజూరు చేయలేదు. దీంతో పొన్నూరు పట్టణ పరిధిలోని 7వ వార్డు డీపీసీ కాలనీ, 12వ వార్డు, 2వ వార్డు, తదితర ప్రాంతాల్లో సాగు, మురుగునీటి కాలువలపై నిర్మించిన వంతెనలు సైడువాల్స్ విరిగిపోయి మరింత అధ్వానంగా మారాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఏక్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.

★ పాత పొన్నూరు నిమ్మ మసీదు వద్ద 2018లో రూ.7 లక్షలతో వంతెన నిర్మించారు. వంతెనకు ఒక వైపు రహదారి నిర్మించలేదు. దీంతో రాత్రి వేళ ఆటుగా ప్రయాణించాలంటే స్థానికులు భయపడుతున్నారు. కొన్ని వంతెనలు పెచ్చులూడి చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. అవి కూలకముందే తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

★ పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనీ, అబ్దుల్ కలాం రోడ్డు, శాంతినగర్‌లో వంతెనలు ప్రమాదకరంగా ఉండడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సమస్యను ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పురపాలక సంఘ అధికారులు ఆ వంతెనల మరమ్మతుల కోసం రూ.15 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో మరమ్మతులు పూర్తి చేశారు.

★ దీనిపై పురపాలకసంఘం డీఈ పి.వెంకయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇటీవల కొన్ని వంతెనలకు మరమ్మతులు చేయించామని, మిగిలిన వాటికి అంచనాలు తయారు చేసి తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

బైండోవర్ నిబంధనల ఉల్లంఘన

రౌడీ షీటర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన రౌడీ షీటర్ ఆనిల్‌పై గతంలో కొట్లాటలు, తదితర అంశాలపై పలు కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో అతన్ని త్రీ టౌన్ పోలీసులు గతేడాది ఆగస్టు నెలలో తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించారు. ఎటువంటి గొడవలకు పాల్పడనని, మంచి ప్రవర్తనతో ఉంటానని ఆసమయంలో తెలియజేశాడు. అయితే దానిని అతిక్రమించి ఇటీవల బంధువుల ఇంటిపై దాడి చేసి సామాన్లు ధ్వంసం చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆనిల్‌ను సీఐ సాంబశివరావు సోమవారం తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ ఎదుట హాజరు పరిచారు. బైండోవర్ నిబంధనల అతిక్రమణపై అతన్ని ప్రశ్నించిన తహసీల్దార్ వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని లేకుంటే బైండోవర్ సందర్భంగా నమోదు చేసిన అపరాధ రుసుము చెల్లించాలని నోటీసు ఇచ్చారు.

ఉచిత రేబిస్ టీకా పంపిణీ

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధకశాఖ గుంటూరు జిల్లా పశువైద్యశాలల పరిధిలోని పెంపుడు జంతువులు, వీధి కుక్కలకు ఉచితంగా వేసేందుకు 25 వేల డోసుల యాంటీ రేబిస్ వ్యాక్సిన్ సరఫరా చేసినట్లు తెనాలి ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకులు బొంతు నాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తెనాలి ఆసుపత్రిలో నిర్వహించిన పెంపుడు జంతువులకు రేబిస్ టీకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జె.డి.కె.వి.సత్యనారాయణ ఆదేశాల ప్రకారం 25 వేల డోసుల వ్యాక్సిన్ మొత్తం వినియోగించుకునే వరకు టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పెంపుడు జంతువుల యజమానులకు ఉచిత టీకాపై అవగాహన కల్పించారు. తెనాలి ఆసుపత్రిలో పనివేళల్లో అన్ని రోజులూ ఈ ఉచిత టీకాను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో విద్యార్థులదే కీలక పాత్ర

చేబ్రోలు: నివాళులర్పిస్తున్న బాజపా నాయకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో విద్యార్థులదే కీలక పాత్ర అని తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టి.వెంకటరమణ పేర్కొన్నారు. కేవలం పట్టాలు పొందడం కాకుండా నైపుణ్య సాధన, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని, డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా నాయకుడు, జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో తెనాలి వివేక జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వివేక విద్యా సంస్థల అధినేత డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు మాట్లాడుతూ శ్యామాప్రసాద్ సేవలు ఎనలేనివి అన్నారు. సొసైటీ అధ్యక్షుడు కంకిపాటి రమేష్‌కుమార్, పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామరాజు ఆయన జీవిత చరిత్రను వివరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు నివాళులర్పించారు.

★ తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో బాజపా గుంటూరు జిల్లా కౌలు రైతు విభాగ సమన్వయకర్త తోటకూర కోటేశ్వరరావు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంకర్రావు, కోటయ్య, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు, న్యూస్‌టుడే: దేశంలో ఒకే జెండా, ఒకే ప్రధాని ఉండాలని పోరాటం చేసిన శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆదర్శప్రాయుడని చేబ్రోలు మండల బాజపా అధ్యక్షుడు శ్రీరామచంద్ర మూర్తి అన్నారు. సోమవారం శ్యామా ప్రసాద్ జయంతిని పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, సాంబిరెడ్డి, ఉమా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం శివారులో గుర్తుతెలియని సుమారు 50 సంవత్సరాల వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని సోమవారం సాయంత్రం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడి చెట్టుకు అతను ఉరి వేసుకున్న క్రమంలో కొమ్మ విరిగి, అతను కింద పడడం, సున్నిత అవయవాల్లోకి కొమ్మ చొచ్చుకు వెళ్లిన ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

సరకు పంపలేదని ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మారీసుపేటలో మౌలాలి ఇనుప తుక్కు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు సరకు పంపుతానని కర్నూలుకు చెందిన రోషన్ జనవరి నెలలో రూ.5 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా సరకు పంపకపోవడంపై మౌలాలి త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సోమవారం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగలు తీసుకెళ్లి..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పట్టణ గంగానమ్మపేటలో రవి బంగారు ఆభరణాలు తయారు చేస్తుంటారు. ఆయన వద్దకు దీరాల వాసి రామచేంద్ర అప్పుడప్పుడు వచ్చి ఆభరణాలు చేయించుకునేవారు. ఈక్రమంలోనే గత ఏడాది రామచేంద్ర, రవి వద్ద రూ.10 లక్షల విలువ చేసే గాజులు, నెక్లెస్ తయారు చేయించుకుని, రెండు రోజుల్లో నగదు ఇస్తానని వాటిని తీసుకెళ్లారు. నెలలు గడుస్తున్నా అతను నగదు ఇవ్వక పోవడంతో రవి సోమవారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వేమూరుకు చెందిన థిలన్ తెనాలి పట్టణంలోని ఒక ప్రైవేటు కంపెనీలో గత కొంత కాలంగా పని చేస్తున్నారు. అదే కంపెనీలో పని చేస్తున్న పణీంద్ర 2023లో తనకు ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మంచి అనుభవం ఉందని, పెట్టుబడి పెడితే బాగా లాభాలు వస్తాయని నమ్మించాడు. దానితో థిలన్ అతనికి విడతల వారీగా రూ.22 లక్షలు ఇచ్చారు. తొలి ఆరు నెలలు లాభాలు వచ్చాయంటూ నెలకు రూ.20 వేల చొప్పున చెల్లించిన పణీంద్ర అటుపై ఎటువంటి చెల్లింపులు చేయడం లేదు. నెలలు గడుస్తున్నా లాభాలు లేవు, అసలు నగదు కూడా ఇవ్వక పోవడంతో తాను మోసపోయానని గుర్తించిన థిలన్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేశారు.

ఒకరికి గాయాలు

కొల్లిపర, న్యూస్‌టుడే: కొల్లిపర శివారు బీసీ కాలనీకి చెందిన పి.లక్ష్మయ్యను సోమవారం రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని ద్విచక్రవాహన చోదకుడు ఢీకొట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని కొల్లిపర వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

చోరీ చేసిన వ్యక్తికి జైలు.. జరిమానా

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాలలోని ఓ ఇంట్లో చోరీ చేసిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తెనాలి రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి జి.శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం స్థానిక బ్రాహ్మణ బజారులో నివసిస్తున్న కొల్లిపర జ్యోతి అనే మహిళ ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లిన సమయంలో నిందితుడైన పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన చిప్పాడ కేదారేశ్వరరావు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.2.33 లక్షల విలువైన సుమారు 88 గ్రాముల బంగారం చోరీ చేశాడు. ఈ ఘటనపై 2025 సెప్టెంబర్ 22న కేసు నమోదైంది. దీనిపై ఎస్సై వెంకటరవి దర్యాప్తు చేసి సాంకేతిక ఆధారాలు సేకరించి, నిందితుడిని అరెస్టు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 5 నెలల రెండు వారాల సాధారణ జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా 10 రోజులు సాధారణ జైలుశిక్ష విధించారు. ఏపీపీ పరిశోగు సునీల్‌కుమార్ కేసు వాదించారు.

మహిళల ఆర్థిక ప్రగతికి చేయూత

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ